రాయచోటికే తలమానికం.. సాయినాథుని ఆలయం

- మార్చి 22న ఆలయ 25వ వార్షికోత్సవం
- భక్తుల రద్దీ దృష్ట్యా అన్ని ఏర్పాట్లు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు


ఆలయంలో కొలువుతీరిన సాయినాథుడు


అధునాతన రీతిలో నిర్మించిన సాయినాథుడి ఆలయం

రాయచోటి అర్బన్ : పట్టణంలోని సంజీవనగర్ కాలనీలో జాతీయ రహదారి పక్కనే నిర్మింపబడిన శ్రీ షిరిడీ సాయినాథుని ఆలయం రాయచోటికే తలమానికంగా చెప్పుకోవచ్చు. అత్యంత అధునాతనమైన డిజైన్, విలువైన టేకుకొయ్య, పాలరాయిలతో పచ్చని చెట్ల నడుమ నిర్మించిన ఆలయం ఈ రహదారి గుండా ప్రయాణించే వారిని ఇట్టే ఆకట్టుకొంటున్నదనడంలో సందేహం లేదు. పిలిచిన వెంటనే పలికే దేవుడిగా సాయినాథుడు ఇక్కడ నిర్మించిన ఆలయంలో కొలువై కోరిన కోర్కెలు తీరుస్తూ భక్తుల ఆరాధ్యదైవంగా వెలుగొందుతున్నాడు. దీంతో అనతికాలంలోనే రాయచోటిలో కొలువైన సాయినాథుడి ఆలయం పేరుప్రతిష్టలు దశదిశలా వ్యాపించాయి.

ఆలయ నిర్మాణం..
పట్టణంలోని సంజీవనగర్ కో–ఆపరేటివ్ కాలనీలోని పార్కు స్థలంలో ఆలయాన్ని నిర్మించాలని పుర ప్రముఖులంతా భావించారు. అడిగిందే తడవుగా అప్పట్లో రూ. 30లక్షలు విలువైన స్థలాన్ని సొసైటీ వారు ఉచితంగా ఇచ్చారు. ఆలయ నిర్మాణం కోసం రాయచోటితోపాటు జిల్లా, రాష్ట్రంలో పలు ప్రాంతాల్లోని భక్తులు విరివిగా విరాళాలు ప్రకటించారు. ఇలా సేకరించిన రూ.30 లక్షలతో 1998లో పట్టణానికి చెందిన చిన్నపిల్లల వైద్యుడు బయారెడ్డి నేతృత్వంలో ఆలయాన్ని తగురీతిలో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయంలో ప్రతిష్టించిన 5.3 అడుగుల ఎత్తుగల సాయినాథుడి పాలరాతి విగ్రహాన్ని రాజస్థాన్‌లోని జైపూర్‌లో ప్రత్యేకంగా తయారు చేయించి తెప్పించారు. ఆలయ నిర్మాణంలో ఇంజనీర్ నాగేశ్వరరావు తన వంతు తోడ్పాటునందించారు. 2000 ఏప్రిల్ 18న సద్గురు దర్గాస్వామి చేతులమీదుగా ప్రారంభమైన ఆలయం నిత్యం భక్తుల పూజలు, భజనలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలతో కళకళలాడుతుంటుంది. అనంతరం భక్తుల కోసం ధాన్యమందిరం, లైబ్రరీలు నిర్మింపజేశారు. మరిన్ని నిధులు సమకూరితే బాబాలెండి వనాన్ని ఏర్పాటు చేయాలనేది కమిటీ సభ్యుల ఆశయం.

25వ వార్షికోత్సవానికి ముమ్మర ఏర్పాట్లు
భక్తుల విశేష పూజలందుకుంటున్న శ్రీ షిరిడీ సాయినాథుడి విగ్రహ ప్రతిష్ట 25వ వార్షికోత్సవం మార్చి నెల 22వ తేదీ శనివారం వైభవంగా నిర్వహింపబడుతుందని షిర్డీసాయి సేవాసమితి సభ్యులు తెలిపారు. ఉదయం 6గంటలకు మహాగణపతి పూజ, శ్రీ గంగాభగీరథీ పూజ, స్వస్తిపుణ్యాహవాచనము, పంచగవ్య, ఋత్విక్కరణము, మాతృకా, నాందీపూజలు, తదితర పూజలు, హోమాలు జరపనున్నారు. మధ్యాహ్నం 12:45 గంటలకు అన్నప్రసాద వినియోగం కలదన్నారు. సాయంత్రం స్వస్తిపుణ్యాహవాచనము బెంగళూరు వేదపాఠశాల ముఖ్య అధ్యాపకులు నరేంద్రస్వామి నేతృత్వంలో జరుగుతుందన్నారు. 6:30 గంటలకు హారతి అనంతరం పల్లకి ఉత్సవం జరుగుతుందన్నారు. భక్తులందరూ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని శ్రీ షిరిడీసాయి సేవాసమితి సభ్యులు విజ్ఞప్తి చేశారు.

26న హుండీ లెక్కింపు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ డివి రమణారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి ఈ లెక్కింపు కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. హుండీ లెక్కింపులో పాల్గొనే భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించి రావాలని కోరారు.

కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

రాయచోటి జగదాంబ సెంటర్ : కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో టైలరింగ్, బ్యూటీపార్లర్, ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌లలో శిక్షణను మహిళలకు ఉచితంగా ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ ఆరీఫ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన మహిళలకు కడపలోని తిరుపతి రోడ్డులోని గర్ల్స్ ఐటీఐ కాలేజీ పక్కన ఈ శిక్షణను అందిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 94409 05478, 99856 06866, 94409 33028 నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

సునీతా విలియమ్స్ స్ఫూర్తిప్రదాత

వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి జగదాంబసెంటర్ : భారత సంతతికి చెందిన వ్యోమగామి సునీతా విలియమ్స్ అందరికీ స్ఫూర్తి ప్రదాతగా నిలిచిందని, ఆమెను చూసి ప్రపంచం గర్విస్తోందని వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. 8 రోజుల్లో పూర్తి కావాల్సిన ప్రయాణం ఒక సాంకేతిక సమస్య కారణంగా 9 నెలలు అంతరిక్షంలో వ్యోమగాములు సునీతావిలియమ్స్, బుచ్‌విల్మోర్‌లు ఉండిపోయారన్నారు. అద్భుతమైన అంతరిక్ష పరిశోధన యాత్రను విజయవంతంగా ముగించుకుని భూమి మీదకు సురక్షితంగా వచ్చిన సునీతా విలియమ్స్‌కు ఆయన అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. అంతరిక్షంలో ఎక్కువ రోజులు గడిపిన మహిళా వ్యోమగామిగా ఆమె రికార్డు సాధించారన్నారు. ఈ విజయంతో సునీతా విలియమ్స్ పేరు అంతరిక్ష పరిశోధనా చరిత్రలో నిలిచిపోనుందన్నారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని ఘనతలు సాధించాలని శ్రీకాంత్ రెడ్డి ఆకాంక్షించారు.

21న వారాంతపు సంత వేలంపాట

గాలివీడు : మండల కేంద్రంలోని కూరగాయల సంత, పశువుల సంత, బస్టాండు రుసుము వేలంపాట 2025 – 26 సంవత్సరానికి సంబంధించి ఈనెల 21వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు డీపీఎల్వో, ఈఓపీఆర్డీ ఆధ్వర్యంలో గాలివీడు గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి బి.ఆంజనేయులు నాయక్, సర్పంచ్ మిట్టపల్లి లక్ష్మీదేవమ్మ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేలంపాటలో పాల్గొనదలచిన వారు పశువుల సంతకు రూ. 2 లక్షలు, కూరగాయల సంతకు రూ.1.50 లక్షలు, బస్టాండ్ రూ.1 లక్ష ధరావత్తు చెల్లించి పాల్గొనాలన్నారు. అంతేగాక పాటదారు తహసీల్దార్ ద్వారా రూ. 3 లక్షల ఆస్తి ధృవీకరణ పత్రం వేలంపాట సమయంలో సమర్పించాలన్నారు.

నేడు పశువుల సంత వేలం
రామాపురం : మండల కేంద్రంలో వారంతపు శనివారం నిర్వహించే పశువుల సంత 2025 – 26 ఆర్థిక సంవత్సరంలో పశువుల సంతతో పాటు బస్టాండు గేటునకు సంబంధించిన వేలం ప్రక్రియను గురువారం సాయంత్రం 3 గంటలకు సంత నిర్వహించే ప్రదేశంలో నిర్వహిస్తున్నట్లు గ్రామ పంచాయితీ కార్యదర్శి నాగరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనదలచినవారు గ్రామ పంచాయతీకి ఎలాంటి బాకీ ఉండరాదని, పశువుల సంత వేలంలో పాల్గొనేవారు రూ.2.50 లక్షలు, బస్టాండు గేటు వేలంలో పాల్గొనేవారు రూ.50 వేల సాల్వెన్సీ సర్టిఫికెట్‌ను తీసుకురావాలన్నారు. అలానే పశువుల సంత వేలం పాటదారుడు రూ. 50వేలు, బస్టాండు గేటు వేలం పాటదారుడు రూ. 30వేలు ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనాలని పేర్కొన్నారు.

పిల్లలను పాఠశాలలో చేర్పించండి

పుల్లంపేట : మండల పరిధిలోని దళవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం పాఠశాల ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు రమణ మాట్లాడుతూ పిల్లల నమోదును పెంచి, నాణ్యమైన, ఒత్తిడి లేని విలువలు కల్గిన విద్యను వారికి అందించడమే తమ పాఠశాల లక్ష్యమన్నారు. కావున తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ బి.మజీద్, పంచాయతీ సెక్రటరీ బాలాజీ, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా కుల్లాయి బాబు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిగా పి.ఎం. కుల్లాయిబాబు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఈయన చింతకొమ్మదిన్నె మండలానికి ఎంపీడీఓగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జెడ్పీ సీఈఓ ఓబులమ్మ మంగళవారం ఉత్తర్వులు జారీ చేయడంతో బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న కెఆర్ఎం ప్రసాద్ ఈఓపీఆర్డీగా బాధ్యతలు చేపట్టారు.

వైద్య సేవలకు సహకరించాలి

చిన్నమండెం : ప్రజలు వైద్య సేవలకు సహకరించాలని డాక్టర్ రఫీకుల్లా పేర్కొన్నారు. చిన్నమండెం మండలం జల్లావాండ్లపల్లెలో ప్రజా చైతన్య సేవా సంఘం ఆధ్వర్యంలో గ్రామంలోని పలువురికి బుధవారం హెచ్ఐవీ పరీక్షలను వైద్య సిబ్బంది నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం రమాదేవి, డీఈఈఓ విజయ్‌కాంత్‌నాయక్, ఆశ కార్యకర్తలు, ప్రజా చైతన్య సేవా సంఘం ప్రాజెక్టు మేనేజర్ స్వాతి, ఏఎన్ఎం నాగరాణి, ఓఆర్‌డబ్ల్యూఎస్ చంద్రకళ, సుహాసిని, విజయలక్ష్మి, అలేఖ్య, ఖాదర్‌వలీ పాల్గొన్నారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్ష

సుండుపల్లె : మండల వ్యాప్తంగా పదవ తరగతి పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. సుండుపల్లె పరీక్షా కేంద్రంలో ఒకరు జికె రాచపల్లి పరీక్షా కేంద్రంలో 260 మందికి గాను ఒకరు పరీక్షకు గైర్హాజరైనట్లు ఎంఈఓ వెంకటేష్‌నాయక్ తెలిపారు. ఫ్లైయింగ్ స్క్వాడ్‌ల పర్యవేక్షణలో పరీక్షలు కట్టుదిట్టంగా జరిపినట్లు ఆయన చెప్పారు. సుండుపల్లె పోలీసులు గట్టి బందోబస్తు కల్పించారు.

నిధులు దుర్వినియోగానికి పాల్పడితే చర్యలు తప్పవు

ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి


వైద్యుడు ప్రకాష్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

సిద్దవటం : ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ నిధులు దుర్వినియోగానికి పాల్పడితే చర్యలు తప్పవని సిద్దవటం ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రకాష్‌ను రాజంపేట ఎమ్మెల్యే, వైఎస్‌ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి హెచ్చరించారు. మండల కేంద్రంలోని 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మెల్యే అధ్యక్షతన బుధవారం హెచ్.డి.ఎస్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆకేపాటి మాట్లాడుతూ హెచ్‌డీఎస్ సమావేశం అంటే నాలుగు గోడల మధ్య నిర్వహించేది కాదనేది మెడికల్ ఆఫీసర్‌కు తెలియజేశారు. ప్రభుత్వ ఆసుపత్రికి పేద రోగులు వస్తుంటారని, వారికి మెరుగైన వైద్య సేవలను అందించాలన్నారు. ఆసుపత్రికి వచ్చే పేద రోగులకు ప్రభుత్వ మెనూ ప్రకారం పౌష్టికాహారం, మెరుగైన భోజనం అందించాలన్నారు. ప్రస్తుతం రోగులకు అందించే భోజనం సరిగాలేదని ఫిర్యాదులు వచ్చాయన్నారు. భోజనం పెట్టే కాంట్రాక్టర్ గడువు ముగిసినందున కొత్తగా టెండర్లు పిలవాలని ఎమ్మెల్యే వైద్యాధికారికి సూచించారు. ఆసుపత్రి అభివృద్ధి నిధులు దుర్వినియోగం చేయకుండా ఆసుపత్రి అభివృద్ధికి వినియోగించాలన్నారు. నిధులు దుర్వినియోగం చేస్తే విచారించి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉపాసి శ్రీకాంత్‌రెడ్డి, ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ డైరెక్టర్‌లు గోపాలస్వామి, వైద్యాధికారులు, కె.వి.సుబ్బయ్య, వైఎస్సార్‌సీపీ రాజంపేట నియోజకవర్గం రైతు విభాగం కన్వీనర్ కె.వి.సుబ్బయ్య, జిల్లా నాయకుడు వల్లిచాన్, యూత్ కన్వీనర్ ఆలం క్రిష్ణచైతన్య, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ వి.పుల్లయ్య కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్‌నూర్, పార్టీ కార్యకర్తలు హిదయతుల్లా, నరసింహారావు, కె.పెంచలయ్య, సుబ్రమణ్యం, జంగాలపల్లె సబ్బారెడ్డి, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గంగమ్మ జాతర

సుండుపల్లె : మండల కేంద్రానికి సమీపంలో బండకాడ ఈడిగపల్లె వద్ద వెలసిన గంగమ్మ తల్లి జాతర రేపటి నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త బీజనగిరి ఈశ్వరయ్య, కార్యదర్శి రాంబాబులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శుక్రవారం ఉదయం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేక కార్యక్రమాలు నిర్వహిస్తారని రాత్రికి జాగారం ఉంటుందన్నారు. ఆసాది వారిచే కథకాలక్షేపంతోపాటు అమ్మవారి గ్రామోత్సవం జరుపనున్నట్లు పేర్కొన్నారు. శనివారం ఉదయం పుట్ట బంగారు తెచ్చి పూజలు చేయడంతోపాటు అమ్మవారికి 101 పల్లెంలలో ప్రసాదాలు పెట్టి పూజించడం జరుగుతుందన్నారు. రాత్రికి చెక్కభజనలు, కోలాటాల మధ్య చాందినీబండ్లు అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణ కార్యక్రమం ఉంటుందని చుట్టుపక్కల గ్రామాల భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు.

22 వరకు ఆధార్ కేంద్రం


చిన్నారికి ఆధార్ నమోదు చేస్తున్న అధికారిణి

నందలూరు : నాగిరెడ్డిపల్లి సచివాలయం–1లో ఆధార్ నమోదు కేంద్రాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిజిటల్ అసిస్టెంట్ రేణుక స్వర్ణ మాట్లాడుతూ ఈనెల 22వ తేదీ వరకు ఆధార్ నమోదు కేంద్రం ఉంటుందన్నారు. కావున 0 నుంచి 5 సంవత్సరాల వారికి ఆధార్ కార్డు నమోదు, అప్‌డేట్ చేయుట, ఆధార్ కార్డు మార్పులు, చేర్పులు, ఫోన్ నెంబరు లింక్ తదితర సేవలను పొందవచ్చన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలి

నందలూరు : రైల్వే కార్మికులకు పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ స్థానిక సెక్రటరీ రవి ప్రకాష్ డిమాండ్ చేశారు. బుధవారం నందలూరు రైల్వే కేంద్రంలో ప్రొటెక్ట్ వీక్‌ను రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రవి ప్రకాష్ మాట్లాడుతూ కొత్త పెన్షన్ విధానంపై కార్మికుల్లో పూర్తిస్థాయి వ్యతిరేకత ఉందన్నారు. కార్మికులు సంఘటితంగా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసేందుకు రాజీలేని పోరాటాలు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ చైర్మన్ పెంచలయ్య, వైస్ చైర్మన్ సురేష్ బాబు, రాజేశ్వరమ్మ, రామకృష్ణ, నరేంద్ర, నాగరాజు, రైల్వే కార్మికులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని మద్దిరేవుల గ్రామ సచివాలయం వద్ద బుధవారం సర్పంచ్ చంద్రమ్మ ఆధ్వర్యంలో వేసవి దృష్ట్యా చలివేంద్రం ఏర్పాటు చేశారు. మద్దిరేవుల ఈడిగపల్లి చుట్టుపక్కల సుమారు 10 కిలోమీటర్ల దూరంకు పైగా మజరా బూడిదగుంటపల్లి, కాకులవరం గ్రామాల ప్రజలు అనేక అవసరాల రీత్యా సచివాలయానికి వస్తుంటారని, వారిని దృష్టిలో పెట్టుకుని చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి రజనీష్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది లావణ్య, నందిని, విజయకుమారి, సెక్రటరీలు వేణు గోపాల్, గిరిబాబు, అడ్వకేట్ వంశీకృష్ణ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి


యుగంధర్, ఈఈ, రాయచోటి

రాయచోటి : విద్యుత్ వినియోగదారుల కోసం ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని రాయచోటి డివిజన్ ఈఈ యుగంధర్ తెలిపారు. బుధవారం ఆయన పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో రాయచోటి డివిజన్ పరిధిలో ఈనెల 21వ తేదీన విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. శుక్రవారం ఉదయం 11:30 గంటల నుంచి 1:30 గంటల వరకు రాయచోటి డివిజన్ ఆఫీసు కాంపౌండ్‌లో ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని, కావున డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు పరిష్కారం కాని తమ సమస్యలను ప్రత్యేక విద్యుత్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని డివిజన్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ తెలియజేశారు. అదాలత్ చైర్‌పర్సన్ వి.శ్రీనివాస్, ఆంజనేయ మూర్తి, రిటైర్డ్ జడ్జి, ఆర్థిక సభ్యులు కె.రామ మోహన్ రావు, సాంకేతిక సభ్యులు ఎస్ ఎల్ అంజనీకుమార్, స్వతంత్ర సభ్యులు పాల్గొంటారని, విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను రాతపూర్వకంగా ఫిర్యాదులు ద్వారా తెలియపరిచి సమస్యలను పరిష్కరించుకోవాలని వారు కోరారు.

వంద శాతం పన్నులు వసూలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ మస్తాన్ వలీ

నందలూరు : వంద శాతం పన్నులు వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి మస్తాన్ వలీ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. బుధవారం ఆయన నందలూరు పంచాయతీ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పన్నులు వసూళ్లు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ, వేసవికాలం తాగునీటి సమస్యలపై తగు సూచనలు, సలహాలు చేశారు. ముఖ్యంగా తాగునీటి సమస్యలు రాకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ సునీల్ కుమార్, టీడీపీ నాయకులు మోడపోతుల రాము, నాగిరెడ్డిపల్లి, నందలూరు పంచాయతీ కార్యదర్శులు సురేష్ కుమార్, శ్రీనివాసులు, ఇతర పంచాయతీల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వసంతోత్సవం


గ్రామోత్సవానికి ముస్తాబైన ఉత్సవమూర్తులు

పుల్లంపేట : మండలంలోని కొత్తపేట గ్రామంలో శ్రీ భద్రావతి సమేత భావనారుషి తిరునాలలో భాగంగా బుధవారం వసంతోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్వామి, అమ్మవార్ల విగ్రహాలను గ్రామ పురవీధులలో ఊరేగించారు. అనంతరం వసంతాలను ఒకరిపై ఒకరు చల్లుకుంటూ ఆనందంగా గడిపారు. దాతల సహకారంతో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన



సిద్దవటం : అసలే భగభగ మండే ఎండలు.. ఆపై రంజాన్ మాసం రెండు వారాలుగా ఉన్న నీటి ఇబ్బందులు పరిష్కారం కాకపోవడంతో ముస్లిం మహిళలు బుధవారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. మండలంలోని మాధవరం–1 పంచాయతీ మహబూబ్ నగర్ మసీదు వీధిలో గత రెండు వారాల నుంచి తాగునీటి కటకట నెలకొందని వారు తెలియజేశారు. ఉపవాసాలు ఉండే సమయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయాన్ని స్థానిక సర్పంచ్ అవ్వారు జానకి రామయ్యకు, అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా స్పందించి నీటి సమస్యను పరిష్కరించాల్సిందిగా గ్రామ ప్రజలు కోరుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

పుల్లంపేట : ప్రస్తుతం ఎండలు అధికంగా ఉండటంతో వడదెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ మనోజ్ చంద్ర తెలిపారు. పిల్లలు, వృద్ధులు ఇంటి నుంచి అత్యవసరమైతే తప్పా బయటకు పంపవద్దని సూచించారు. వేడిగాలుల హెచ్చరికలు ఉన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ నీటిని తరుచూ తాగాలని తెలియజేశారు.

పాలసీదారులపై భారం తగ్గించాలి


ధర్నా చేస్తున్న లియాఫీ నాయకులు

రాజంపేట టౌన్ : జీవిత బీమా పాలసీదారులపై భారం తగ్గించాలని లియాఫీ రాజంపేట శాఖ అధ్యక్షుడు ఏవీ సుబ్బయ్య, కార్యదర్శి ముద్దా శంకర్‌రెడ్డి తెలిపారు. సమస్యల పరిష్కారానికై ఎల్ఐసీ ఏజెంట్స్ యూనియన్ ఢిల్లీలో చేపడుతున్న మహాధర్నాకు మద్దతుగా బుధవారం లియాఫీ ప్రతినిధులు స్థానిక ఎల్ఐసీ కార్యాలయ ఆవరణలో శాంతియుతంగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలసీదారులకు బోనస్ పెంచాలని, ప్రీమియంపై జీఎస్టీ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సరెండర్ వ్యాల్యు సవరించాలని, మినిమమ్ పాలసీ లక్ష రూపాయలు చేయాలని, క్లా బ్యాక్ క్లాజ్ ఎత్తివేయాలని తెలిపారు. తమ డిమాండ్లపై యాజమాన్యం స్పందించి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. యాజమాన్యం సమస్యల పరిష్కారంపై అలసత్వం వహిస్తే ఆందోళనను ఉధృతం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లియాఫీ కోశాధికారి సుధాకర్‌రాజు, ఎల్ఐసీ ఏజెంట్లు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు


విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ చలపతి

రాయచోటి టౌన్ : మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని రాయచోటి అర్బన్ సీఐ బివి చలపతి విద్యార్థులను హెచ్చరించారు. బుధవారం రాయచోటి పట్టణంలో మైనర్ బాలురులు (విద్యార్థులు) ద్విచక్రవాహనాలు నడుపుతున్న వారిని అదుపులోకి తీసుకొని అర్బన్ స్టేషన్‌కు తీసుకొచ్చి కౌన్సిలింగ్ ఇచ్చారు. ద్విచక్ర వాహనాలు నడపాలంటే తప్పకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం మేజర్లు అయ్యుండాలని తెలిపారు. అలా కాకుండా వయస్సు తక్కువ ఉన్నవారు వాహనాలు నడిపితే ఆ వాహనాలు ఇచ్చిన పెద్దలపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. నిబంధనలు పాటించకుండా వాహనాలు నడిపినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సూచించారు.

కులవృత్తుల చేయూతకే ఆదరణ


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయారావు

పెనగలూరు : బీసీ ఉప కులాల్లో చేతివృత్తులపై ఆధారపడి జీవిస్తున్నవారికి అండగా నిలిచేందుకు ప్రభుత్వం ఆదరణ పథకం తీసుకువచ్చిందని ఎంపీడీఓ విజయారావు తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో వివిధ రకాల కులవృత్తుల వారితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ కులానికి ఏయే పనిముట్లు అవసరమో వారి ద్వారా తెలుసుకోవడం జరిగిందని, కులవృత్తుల వారికి కావాల్సిన పనిముట్లు ఉన్నతాధికారులకు పంపించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కులాలకు చెందిన కులవృత్తుల వారు పాల్గొన్నారు.

నేడు గాలివీడు, ఒంటిమిట్టలో..
గాలివీడు/ఒంటిమిట్ట : ఈ నెల 20వ తేదీ ఉదయం 11 గంటలకు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో కులవృత్తులు, చేతివృత్తులు చేసుకునే వారి కోసం జరిగే సమావేశానికి బీసీ కులాల వాళ్లు హాజరవ్వాలని ఆయా మండలాల ఎంపీడీఓలు జవహర్ బాబు, కుల్లాయి బాబులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సమావేశం ముఖ్య ఉద్దేశం బీసీ కులాల్లోని చేతివృత్తుల వాళ్లు ఆదరణ–3 పథకం కింద వారికి అవసరమైన ఆధునిక పనిముట్లు విషయమై వారి నుంచి సలహాలు, సూచనలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం


ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ వద్ద అధికారులు, కొనుగోలుదారులు

చిన్నమండెం : ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఎస్2ఎస్ రైతులు పండించిన ఉత్పత్తులు ఆరోగ్యకరమని మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ పద్మావతి, వాల్యూ చైన్ చంద్రశేఖర్‌లు పేర్కొన్నారు. బుధవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను అందించాలనే లక్ష్యంతో ఈ స్టాల్‌ను నిర్వహించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో డీపీఎం ప్రవీణ్‌కుమార్, ఎంటీఎల్ చందురెడ్డి, ఎస్ఎఫ్ ఇంటర్న్స్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి


గోడపత్రాలను విడుదల చేస్తున్న కార్మిక నాయకులు

రాయచోటి టౌన్ : ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి బత్తల రమణ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కోశాధికారి హుస్సేన్ బాషాలు అన్నారు. బుధవారం రాయచోటిలో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఛలో ఢిల్లీ కార్యక్రమంపై గోడపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు కావొస్తున్నా ఇప్పటి వరకు కార్మికులకు వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయలేదన్నారు. 1996లో అమలు చేసిన చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఒక శాతం ఉన్న సెస్‌ను రెండు శాతానికి పెంచి కార్మికులకు వైద్యంతోపాటు పింఛన్ రూ.6000లు అందించే విధానాన్ని అమలు చేయాలన్నారు. సమస్యల పరిష్కారంపై ఢిల్లీలో ఈనెల 28వ తేదీన మహా ధర్నా కార్యక్రమాన్ని చేపడుతోందని కార్మికులు విజయవంతం చేయాలని కోరారు.